క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



రాయపర్తి : మండలంలోని బాల్‌నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు తెలిపారు. గ్రామానికి చెందిన గుగులోత్ యాకూబ్, బానోత్ యాకూబ్, భూక్యా యాకూబ్, భూక్యా నవీన్, భూక్యా భీమా, భూక్యా వెంకన్న పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ప్రధాన కార్యదర్శి పూస మధు, సారంగం, సర్పంచ్ జగన్, గ్రామఅధ్యక్షుడు భూక్యా వెంకన్న, చందు సతీష్, బల్లెం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పర్వతగిరి : మండల కేంద్రంలో గౌడ సొసైటీ అధ్యక్షుడు పుల్లూరి సారయ్యగౌడ్ అధ్యక్షతన శనివారం గౌడ గర్జన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ప్రభుత్వం గౌడలను విమర్శించిందని దుయ్యబట్టారు. రాజకీయ పార్టీలు గౌడలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ జేఏసీ నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, జనగాం శ్రీనివాస్‌గౌడ్, నకిరెకంటి మోహన్ డిమాండ్ చేశారు. నేడు హనుమకొండ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే గౌడ గర్జన సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

నర్సంపేట : నర్సంపేట పట్టణంలో పారిశుద్ధ్య లోపంతో వారం రోజులుగా డెంగీ అధికమై పిల్లల ప్రాణాలు పోతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 24వార్డుల్లో పారిశుద్ధ్య లోపం, పందులు, కుక్కలు, స్వైర విహారం చేస్తున్న రాజకీయ నాయకులు, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదన్నారు. నర్సంపేట కుమ్మరికుంటకు చెందిన సాత్విక్ డెంగీతో బాధపడుతూ జిల్లా ఆస్పత్రిలో సరైన వసతులు లేక ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టణంలో పేరుకుపోయిన చెత్త, చెదారం, డ్రెయినేజీను శుభ్రం చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసుల ఔదార్యం



సంగెం : బురదమయంగా మారిన రోడ్డుపై మొరం పోయించి పోలీసులు ఔదార్యం చాటుకున్నారు. మండలం కేంద్రం నుంచి కుంటపల్లి బైపాస్ రోడ్డు వర్షాలకు బురదగా మారింది. వాహనదారుల ఇబ్బందులు గుర్తించి ఎస్సై భరత్ ఆదేశాల మేరకు శనివారం మొరం పోయించి చదును చేయించడంతో ప్రయాణికులు పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్ దాతృత్వం



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.40 వేల విలువగల స్కూల్ బ్యాగులు, టై, బెల్టులు, షూ లను సీఆర్‌పీఎఫ్ జవాన్ కొత్తపల్లి రాము శనివారం అందించి దాతృత్వం చాటారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామస్వామి, సుధాకర్‌రెడ్డి, రవికిరణ్, ముత్తినేని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఖానాపురం : పర్యాటకులపై దాడికి పాల్పడిన గేట్ కీపర్స్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. పాకాల పర్యాటక ప్రాంతం వద్ద శుక్రవారం సాయంత్రం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ప్రకాశ్, రవి, రాజ్‌కుమార్, చందులాల్, మహేష్‌లపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మార్సీలో చోరీ

ఖానాపురం : మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతిరోజూ కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తించి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీల రాడ్లు తొలగించి స్టేషనరీ ఉండే గదిలో ఫ్యాన్, ఇన్వర్టర్ బ్యాటరీని అపహరించారు. గదిలోని బీరువా తలుపులు సైతం తొలగించారు. శనివారం కార్యాలయ సిబ్బంది గదిలోకి వెళ్లి చూసి సామగ్రి చోరీకి గురైందని గమనించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



రైతులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

నర్సంపేట రూరల్ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురిజాలలో నాబార్డ్ ఆధ్వర్యంలో 500 మెట్రిక్ టన్నుల గోదాంను డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. పంటలు నష్టపోయిన రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీ కింద సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.పది వేల చొప్పున పంట నష్టపరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు నష్టపరిహారం చెక్కులు తీసుకుంటూనే.. మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులకే చెక్కులు వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు వ్యవసాయ పరికరాలను 50 శాతం రాయితీపై అందించేందుకు ఎగ్జిబిషన్ సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి ఇన్ని నిధులు తీసుకొచ్చి రైతులకు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు అభినందించాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. పీఏసీఎస్ ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత గురిజాల గ్రామంలో ఎమ్మెల్యేకు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎడ్లబండిపై ఎమ్మెల్యేను ర్యాలీగా సొసైటీ కార్యాలయానికి కార్యకర్తలు తీసుకొచ్చారు. నర్సంపేట ఏడీఏ తోట శ్రీనివాసరావు ఎంపీపీ మోతె కళావతి, జెడ్పీటీసీ కోమాండ్ల జయగోపాల్‌రెడ్డి, సర్పంచ్ గోడిశాల మమత సదానందం, ఎంపీటీసీ బండారి శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల రమేష్, నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, ఏఓ కృష్ణకుమార్, ఏఈఓలు అశోక్, భరత్, సింధు, మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నర్సంపేట : ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన ఓరుగంటి చేతన్‌శ్రీతేజ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్, ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువులో శనివారం అరూరి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.4.64 లక్షల విలువైన 2.86 లక్షల ఉచిత చేపపిల్లలను వదిలారు. అనంతరం రూ.14 కోట్లతో చేపట్టిన కోనారెడ్డి చెరువుకట్ట మరమ్మతు, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను పంపిణీ చేస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, తోటకూరి రాజమణి, నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, ఎండీ.రహీం పాల్గొన్నారు.



కోనారెడ్డి చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

మన ఓటు మనం వేసుకుందాం..

● మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి
● గీసుకొండలో మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం

గీసుకొండ : ఐక్యంగా ఉండి మన ఓట్లు మనం వేసుకోవడంతోపాటు బీసీలను కలుపుకుని ముందుకు పోతే అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల మెజారిటీతో మున్నూరుకాపు బిడ్డ పరకాల ఎమ్మెల్యేగా గెలుపొందే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. మరియపురం సమీపంలోని ఎస్‌ఎస్ గార్డెన్స్‌లో శనివారం మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీజేపీ నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనాభాలో తక్కువగా ఉన్న అగ్రకులాలు రాజకీయంగా బీసీలపై పెత్తనం చెలాయిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ మున్నూరుకాపు కులస్తులు, బీసీల ఆశీర్వాదంతో తాను రాజకీయంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు. మున్నూరు కాపు కుల పెద్దలు, సంఘం నాయకులు తోట తిరుపతయ్య, పూజారి సత్యనారాయణ, గుళ్లపల్లి వెంకటేశ్వర్లు, గైనేని రాజన్, వాసం సురేశ్, గోదాసి చిన్న, వీరేశం, కూసం లింగయ్య, ఆరె కుమార్, భూతం రామయ్య, పిట్ట వీరస్వామి, పెరికాటి హేమలత, గజ్జి రవి, రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచుతాయి



విద్యార్థులతో ఎంపీపీ అప్పారావు తదితరులు

వర్ధన్నపేట : క్రీడలు దేహదారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. శనివారం వర్ధన్నపేట పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంఈఓ రంగయ్య పాల్గొని ప్రారంభించారు. వర్ధన్నపేట, రాయపర్తి మండలాలకు చెందిన విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. ఏ–విభాగంలో వాలీబాల్‌లో జెడ్పీఎస్‌ఎస్ కాట్రపల్లికి చెందిన విద్యార్థులు పి.రాజేష్, మధు, ఎంపికయ్యారు. కబడ్డీలో విజయకుమార్, రంజిత్, రేవంత్, వాలీబాల్‌లో మైత్ర, రమ్య, కబడ్డీలో స్రవంతి ఎంపికయ్యారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు పి.సమ్మయ్య, హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశ యాత్ర



కలశ యాత్ర నిర్వహిస్తున్న పోస్టల్ సిబ్బంది

నర్సంపేట : నర్సంపేట పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధులు, పుర ప్రముఖులు, పోస్టల్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సెంటర్ నుంచి అమరవీరుల స్తూపం వరకు మేరీ మాటి.. మేరా దేశ్ మట్టి కా నమన్ వీరోన్ కా వందన్ అమృత కలశ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. భారతీయులంతా కుల, మతాలకు అతీతంగా గాంధీని ఆదర్శంగా తీసుకుని కలిసి, మెలిసి జీవించాలన్నారు. కార్యక్రమంలో పెండెం రాజమౌళి, పోస్ట్ మాస్టర్ రాజేందర్, సురేష్, అనిల్, నల్ల మనోహర్‌రెడ్డి, వడ్లకొండ సాంబయ్య, కోదాటి వీరస్వామి, దొంతి రాజిరెడ్డి, మల్లయ్య, రాంబాబు, జగన్‌మోహన్‌రెడ్డి, వివిధ గ్రామాల పోస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాకలో పౌరహక్కుల దినోత్సవం

నెక్కొండ : కుల, మతాలకు అతీతంగా నిర్వహించే సహపంక్తి భోజనాలతో ప్రజల్లో ఉన్న అసమానతలు తొలగిపోతాయని డిప్యూటీ తహసీల్దార్ రవి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం సర్పంచ్ లావుడ్యా సరితాతిరుమల్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. హక్కులకు భంగం కల్గిస్తే పౌర హక్కు పరిరక్షణ చట్టం–1955 ననుసరించి అంటరానితనం, ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. సమాజంలో ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉందని, వారి హక్కులను పరిరక్షించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దళితులకు ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ వి.రత్నమాల, ఆర్‌ఐ నరేందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ, దళిత సంఘాల నాయకులు మాంకాల యాదగిరి, ఈదునూరి వెంకటేశ్వర్లు, వివిధ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నారావుపేట : క్షయపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సరోజ అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో శనివారం ఆమె మాట్లాడారు. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉంటే వెంటనే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులు కూడా క్రమం తప్పకుండా మందులు వాడుతూ మంచి ఆహారపు అలవాట్లతో వ్యాధిని నివారించవచ్చని అన్నారు. ఈ అవగాహన సదస్సులో సిబ్బంది శివాజీ, హేమలత, మంజుల, తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం

ఖానాపురం : మండలంలోని దబ్బీర్‌పేటలో శనివారం పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి.. పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు చేసి మందుల పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ, ఎంపీటీసీ శంకర్, డాక్టర్ రామ్మోహన్, సూపర్‌వైజర్ జహంగీర్, గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, మధుకర్ పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న పశువైద్యులు

వ్యక్తి అదృశ్యం

చెన్నారావుపేట : వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని ఎల్లాయగూడెం శివారులోని నంబర్ 3 కాలనీలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్సై లక్ష్మణమూర్తి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బర్ల యాకయ్య కొన్ని రోజులుగా మద్యానికి బానిస అయ్యాడు. గత నెల 25న భార్య మంజులతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో యాకయ్య భార్య మంజుల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మండల కమిటీ ఎన్నిక



గంగాధర్, అధ్యక్షుడు

ఖానాపురం : గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ మండల కమిటీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మేరుగు గంగాధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కుమార్, ఉపాధ్యక్షులుగా మక్కా వెంకన్న, ఆకుల ఉపేందర్, విష్ణు, సహాయ కార్యదర్శులుగా బందారపు శ్రీనివాస్‌గౌడ్, బొమ్మగాని నవీన్, గుడిసె సూరయ్య, లక్ష్మణ్, కోశాధికారిగా గుండ్లపెల్లి సదానందంగౌడ్, అధికార ప్రతినిధిగా సంజీవ, సభ్యులుగా మనోహర్, సదానందం, రమేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం..



సూర్యనారాయణ, అధ్యక్షుడు

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లి–రాంపూర్ జంట గ్రామాల్లో కల్లుగీత కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతనూరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అంబాల రాజు, కార్యదర్శిగా గాదగోని సదానందం, కోశాధికారిగా పెరుమాండ్ల రాములు, కమిటీ సభ్యులుగా సట్ల ఎల్లగౌడ్, పెరుమాండ్ల బాబుగౌడ్, బొడిగె కుమారస్వామి, తాళ్లపల్లి సుదర్శన్, పూజారి రవి, సలహా కమిటీ సభ్యులుగా కట్టికోళ్ల సోమన్న, బసవయ్య, కట్టికోళ్ల వెంకన్న, అక్కపెల్లి రమేష్, బొడిగె రాములు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్ నాగరాజు

పర్వతగిరి : పార్టీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ నాయకుడు కేఆర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు మండలంలోని అన్నారం షరీఫ్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు పర్వతగిరి నుంచి బైక్ ర్యాలీ చేపట్టి కార్యకర్తలు కల్లెడ మీదుగా అన్నారం షరీఫ్ గ్రామానికి చేరుకుని యాకుబ్‌బాబా దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు, మహిళలు, పేదలకు మేలు జరుగుతుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు నియోజకవర్గ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, జిల్లా నాయకుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు గొడుగు భిక్షపతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న దొంతి మాధవరెడ్డి



గీసుకొండ: పరామర్శిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేటలోని 18వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గిరిగాని రవిచందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం రవిచందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే 13వ వార్డుకు చెందిన ఎండి అవేసు కుమారుడు డెంగీతో ఇటీవల మృతి చెందగా దొంతి పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండెం రామానంద్, బత్తిని రాజేందర్, వేముల సాంబయ్యగౌడ్, ఎలకంటి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండలో..

గీసుకొండ : మండలంలోని పోతరాజుపల్లిలో దొమ్మాటి చిరంజీవి, పుస్కూరి కొమ్మాలు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు శనివారం బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి పరామర్శించారు. అలాగే ఉడుతనబోయిన అనిల్ ప్రమాదవశాత్తు గాయపడగా రూ.5 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లా రమేశ్, మొలుగూరి శ్రీనివాస్, బత్తుల అశోక్, మోర్తాల శ్యాం, పలువురు పాల్గొన్నారు.



రాయపర్తి : నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

ఎంపీపీని పరామర్శించిన ప్రజాప్రతినిధులు,అధికారులు

రాయపర్తి : స్థానిక ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి ఇటీవల మృతిచెందగా స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తితోపాటు ఏఓ వీరభద్రం, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమాన్‌గాంధీ నాయక్ ఎంపీపీని పరామర్శించారు. అనంతరం బుచ్చిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మేడారపు సుధాకర్, మైబురెడ్డి, వళపాక కుమారస్వామి, చిన్నాల రాజబాబు, యుగేందర్‌రెడ్డి, బాషబోయిన సుధాకర్, యాదగిరి, వళపాక యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సభ

● సంబంధిత శాఖ అధికారుల గైర్హాజర్
● అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పారావు

వర్ధన్నపేట : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గైర్హాజర్‌పై మండల సభ అసహనం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఎంపీపీ అన్నమనేని అప్పారావు కీలకమైన శాఖల ప్రభుత్వ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడాన్ని ఆక్షేపించారు. గత సమావేశాల్లో సైతం ఇలాగే జరిగిందని ఈ పద్ధతి మంచిది కాదన్నారు. శనివారం వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ అప్పారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కేవలం కొన్ని శాఖల అధికారులు హాజరు కావడంతో మొక్కుబడిగా సమావేశాన్ని నిర్వహించి పూర్తి చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాపై చెన్నారం, కడారిగూడెం, ఇల్లంద గ్రామాల సర్పంచ్‌లు పానుగోటి భాస్కర్‌రావు, మంద సతీష్, సుంకరి సాంబయ్య తమ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏఈ సాయిరాం మాట్లాడుతూ.. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదని దానిని త్వరలో చేసి పూర్తిస్థాయిలో నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా గ్రామాల్లో పూర్తైన పనుల బిల్లులకు సంబంధించిన పత్రాలపై సర్పంచ్‌లు సంతకాలు చేయకపోవడం వల్ల బిల్లులు ఆగిపోతున్నాయన్నారు. తమ గ్రామాలకు నీరు అందనపుడు బిల్లులపై ఎలా సంతకం చేస్తామని వారు ప్రశ్నించారు. ఎంపీపీ అప్పారావు కలుగచేసుకుని గ్రామాల్లో నీటి సరఫరా పూర్తి స్థాయిలో అందే విధంగా చూడాలన్నారు. రైతులకు రుణమాఫీపై బ్యాంకులు సరైన సమాధానాలు తెలపడం లేదని తమ గ్రామంలోని ఐఓబీ శాఖలో అర్హులైన కొందరి రైతులకు రుణమాఫీ అందలేదని ల్యాబర్తి ఎంపీటీసీ అన్నమనేని ఉమాదేవి సభ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకు అధికారులను అడిగితే వారు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. వర్ధన్నపేట సహకార బ్యాంకు సీఈఓ వెంకన్న సమాధానమిస్తూ తమ పీఏసీఎస్‌లో సైతం కొందరి రైతులకు, రూ.20, 30 వేల రుణాలు ఉన్న వారికి సైతం జాబితాలో పేర్లు రాలేదని దీనిపై ఉన్నతాధికారులకు వారి వివరాలను పంపించడం జరిగిందని త్వరలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దళిత బాంధవుడు సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణు

చెన్నారావుపేట : దళితుల అభివృద్ధికి దళితబంధు పథకం అమలుచేసి ఆదుకుంటున్న దళిత బాంధవుడు సీఎం కేసీఆర్ అని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోతి విష్ణు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని లింగగిరిలో మాలమహానాడు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దళిత సామాజిక వర్గ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారని, దళితులు పెద్దికి రుణపడి ఉంటారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో దళిత బంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కడగండ్ల యాకయ్య, కనుకుల వేణు, సంపత్, సాలయ్య, నర్సయ్య, ప్రసాద్, సంపత్, కరుణాకర్, బాబు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



దినేష్ (ఫైల్)

రాయపర్తి : ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందినట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని ఊకల్‌కు చెందిన నర్సింహుల దినేష్(22) గతనెల 28న మైలారంలో ఉన్న తన మిత్రుడిని తీసుకు వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో స్నేహితుడితో కలిసి వెళ్తుండగా గట్టికల్ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో దినేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు తన తాత వంతుకు వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు.